క్లుప్తంగా

అధినేతను కలిసిన యువజన విభాగం నాయకుడు



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన యువజన విభాగం నాయకుడు దామోదర్‌రెడ్డి

బెళుగుప్ప: విజయవాడలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అంకంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు దామోదర్‌రెడ్డి కలిశారు. గురువారం మాజీ సీఎం తిరుపతికి బయల్దేరుతుండగా తాడేపల్లిలో ఉరవకొండ నియోజకవర్గ నాయకులతో కలసి మాట్లాడారు. పార్టీలోని ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని ధైర్యంగా ఉండాలని ఆయన సూచించినట్లు నాయకులు తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌కు అవకాశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, తదితరులు

అనంతపురం: ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద యువతకు ఉత్తమమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ పథకం ద్వారా యువతకు ప్రతిష్టాత్మకమైన కంపెనీల్లో పని అనుభవం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సాయం అందుతుందన్నారు. పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అర్హులైన వారు దరఖాస్తులను నేరుగా https://pminternship.mca.gov.in/ login వెబ్‌సైట్ ద్వారా అందజేయవచ్చు. వివరాలకు కరీముల్లా (83413 66022), సంజామల రఫీ (94906 22810)ను సంప్రదించవచ్చు.

అత్యుత్తమ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్


దేశంలోనే అత్యుత్తమంగా ఖ్యాతి గాంచిన 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం కల్పిస్తారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన వారికి స్టైఫండ్ కింద నెలకు రూ.5 వేలు చెల్లిస్తారు. ఇందులో రూ.4,500ను కేంద్ర ప్రభుత్వం, రూ.500ను కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కంపెనీ భరిస్తాయి. అలాగే వన్–టైమ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ కింద కేంద్ర ప్రభుత్వం నేరుగా రూ.6 వేలను ఒకేసారి చెల్లిస్తుంది. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, బీబీఏ, బీఫార్మసీ, పూర్తి చేసిన వారు, చివరి సెమిస్టర్‌లో చదువుతున్నవారు అర్హులు.

కాలిపోయిన పశుగ్రాసం

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లి గ్రామ శివారులో శుక్రవారం మధ్యాహ్నం కావలి రామరాజుకు చెందిన పది ఎకరాల్లోని పశుగ్రాసం కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది.

విఠల..విఠల
పాండురంగ విఠల

- ఊరూరా ముక్కోటి ఏకాదశి పూజలు
- వేంకటరమణస్వామి ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
- భక్తులతో కిక్కిరిసిన వైష్ణవాలయాలు



బొమ్మనహాళ్: గరుడ వాహనంపై వెంకటేశ్వరస్వామి



రాయదుర్గం కోటలో వెలసిన సతీసమేత శ్రీప్రసన్న వేంకటరమణస్వామి



పెన్నహోబిలంలో లక్ష్మీనృసింహస్వామి



బొమ్మనహాళ్: రుక్మిణీ పాండురంగస్వామి ఆలయం వద్ద క్యూ కట్టిన భక్తులు



బొమ్మనహాళ్‌లో ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి



బెళుగుప్ప: శ్రీరంగాపురంలో ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి



బ్రహ్మసముద్రంలో ప్రత్యేక అలంకరణలో రంగనాథ స్వామి

రాయదుర్గం/రాయదుర్గంటౌన్ /కళ్యాణదుర్గం రూరల్ / బొమ్మనహాళ్/ ఉరవకొండ/కూడేరు/ బ్రహ్మసముద్రం:

- రాయదుర్గంలోని ప్రముఖ వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. ప్రసన్న వేంకటరమణస్వామి, నగరేశ్వరస్వామి, లక్ష్మీ నారాయణాస్వామి, జంబుకేశ్వరస్వామి, దశభుజ గణపతి, సంతాన వేణుగోపాలస్వామి, శనీశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. . 'గోవిందా..గోవింద' నామస్మరణ ఆలయ వీధుల్లో మార్మోగింది. ఉత్తర ద్వారా దర్శనంకోసం ఆలయ ముఖద్వారం బయట రోడ్డుపై భక్తులు బారులు తీరి కనిపించారు.
- బొమ్మనహాళ్‌లోని వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆంధ్ర పుండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం, వేంకటేశ్వరాలయం, నేమకల్లు ఆంజినేయస్వామి, కల్లుదేవనహళ్లి ఆంజినేయస్వామి , ఉప్పరహాళ్ క్రాస్ పాండురంగస్వామి, లింగదహాళ్ పాండురంగ స్వామి ఆలయంలో ఏకాదశి పూజలు జరిగాయి.
- ఉరవకొండలోని పెన్నహోబిల లక్ష్మీనృసింహస్వామి ఆలయంతోపాటు అన్ని ప్రముఖ ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి భూదేవి, శ్రీదేవి సమేతంగా భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు. పురాతన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బ్రహ్మణవీధిలోని పాండురంగ స్వామి ఆలయంతో పాటు బళ్లారి బైపాస్ వద్ద శ్రీకృష్ణ మందిరంలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు.
- కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గంలోని ఆర్‌డీటీ ఆస్పత్రి వద్ద ఉన్న మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు.
- కూడేరు పరిధిలోని అంతరగంగలో ప్రసిద్ధి గాంచిన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని లక్ష్మీ,చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. అంతరగంగ, కూడేరు, ఇప్పేరు, నాగిరెడ్డిపల్లి, మరి కొన్ని గ్రామాల నుంచి ప్రజలు వందలాదిగా తరలివచ్చి చెన్నకేశవ స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.
- బ్రహ్మసముద్రం మండలంలో ముక్కోటి ఏకాదశి పూజలు శుక్రవారం వైభవంగా జరిపారు. రంగనాథస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కలిపించారు.

కుందుర్పి: మండలంలోని వైష్ణవాలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు శుక్రవారం నిర్వహించారు. కుందుర్పి కోదండరామస్వామి ఆలయం, తూముకుంట హరిహరేశ్వర ఆలయం, నాగేపల్లి యల్లమ్మ దేవి, వడ్డేపాళ్యం, గుడిబండ ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

బెళుగుప్ప మండలంలోని శ్రీవైష్ణవ ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరంగాపురంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఉత్తరద్వారం ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. బూదిగుమ్మ శ్రీపద్మావతి వెంకటరమణ స్వామి, బెళుగుప్ప వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారాల్లో దర్శనం కల్పించారు.

- కణేకల్లులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు ఉత్తరద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరలో తిమ్మప్ప (వెంకటేశ్వర)స్వామి దర్శనానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కంబదూరు: మండలంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఒంటారెడ్డిపల్లిలో వెలసిన శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వజ్రకరూరు : మండల కేంద్రంలోని స్థానిక జనార్దన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్ర వారం లక్ష దీపారాధన ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. వజ్రకరూరులోని బ్రాహ్మణ వీధిలో లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. బలిజవీధిలోని సీతారామస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు.



ముక్కోటి ఏకాదశి సందర్భంగా విశేష అలంకరణలో ఉరవకొండలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి



కంబదూరులో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

టీడీపీ నేతల బరితెగింపు

- పాఠశాల ప్రహరీ కూల్చివేత
- స్థలం కబ్జా కోసమే దుశ్చర్య
- కూల్చివేత వెనుక అధికారుల హస్తం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతి అంశాన్ని తమకు ఆదాయ వనరుగా స్థానిక టీడీపీ నేతలు మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలం కనిపిస్తే వెంటనే కబ్జా చేసేస్తున్నారు. తాజాగా మరో అడుగు ముందుకేసి ఏకంగా పాఠశాల స్థలాన్ని కబ్జా చేసేందుకు పావులు కదిపారు. పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకునేందుకు అడ్డుగా ఉన్న ప్రహరీని కూల్చి వేశారు. కణేకల్లు మండలం తుంబిగనూరు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

దౌర్జన్యాలకు పరాకాష్టగా..

ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూల్చివేత ఘటన స్థానిక టీడీపీ నేతల దౌర్జన్యాలకు పరాకాష్టకు నిదర్శనంగా నిలిచింది. ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'మనబడి నాడు–నేడు' కింద వివిధ అభివృద్ధి పనులను చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. విద్యార్థుల తాగునీటి కోసం రూ.1.20 లక్షల వ్యయంతో వాటర్ సంప్ ఏర్పాటు చేశారు.



కూల్చి వేతలు మొదలు పెట్టిన దృశ్యం

పాఠశాల చుట్టూ ప్రహరీని నిర్మించారు. ఈ పాఠశాల వెనుక అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత ప్రభాకరగౌడ్, కోట్రేగౌడ్ పొలాలు ఉన్నాయి. వీటికి రాకపోకలు సాగించేందుకు గరుడచేడు గ్రామం వైపుగా రస్తా కూడా ఉంది. అయితే పాఠశాల పక్క నుంచి అయితే దగ్గరగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సదరు పొలానికి మార్కెట్‌లో డిమాండ్ భారీగా పెరిగే అవకాశాలూ ఉన్నాయి. దీంతో వ్యవసాయ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగించాలని నిర్ణయించుకున్న టీడీపీ నేతలు తమ పలుకుబడిని ఉపయోగించారు. శుక్రవారం నుంచి పాఠశాలకు సంక్రాంతి సెలువులు కావడంతో ఉపాధ్యాయులు ఎవరూ విధులు హాజరు కారని తెలుసుకున్న టీడీపీ నేతలు ఆగమేఘాలపై కూల్చివేత పనులు చేపట్టారు. ఈ దుశ్చర్యకు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ పరోక్షంగా సహకరించినట్లు విమర్శలున్నాయి. మొత్తం 18 అడుగుల వెడల్పు... 50 అడుగుల పొడవు ఉన్న స్థలాన్ని అందరూ చూస్తుండగానే సోదరులిద్దరూ కబ్జా చేశారు.

హెచ్చరించిన 'సాక్షి'

తుంబిగనూరు గ్రామంలో టీడీపీ నేతలు స్కూల్ స్థలం కబ్జాకు కుట్రలు సాగిస్తున్న వైనాన్ని గతంలో 'సాక్షి' బహిర్గతం చేసింది. గత ఏడాది డిసెంబర్ 5న 'స్కూల్ స్థలంపై పచ్చనేత కన్ను' శీర్షికతో 'సాక్షి'లో వెలువడిన కథనం తెలిసిందే. అయితే అప్రమత్తమవ్వాల్సిన అధికారులు టీడీపీ నేతలకు అండగా నిలిచి దురాక్రమణకు ప్రోత్సహించడం విమర్శలకు దారితీస్తోంది. ఈ కబ్జాలో అధికారుల వాటా ఎంత? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

- యువజనోత్సవంలో గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర స్వామి



బహుమతి అందిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి

ఉరవకొండ: దేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులో యోగా, వేదాంత శాస్త్రాలను తన వాదనల ద్వారా పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద నేటి యువతకు స్ఫూర్తిదాత అంటూ ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి కొనియాడారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ యువజనోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి గవిమఠం ఉత్తరాధికారి హాజరై, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. అనంతరం డిగ్రీ కళాశాల, ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, భగవద్గీత కంఠస్థ, యోగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటరాముడు, పరమేష్, ఆయూర్ ప్రతినిధి వెంకట్ తాడికొండ పాల్గొన్నారు.

రీసర్వే పారదర్శకంగా చేపట్టండి

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లి, కరిగానిపల్లి రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని అప్పిలేపల్లి, కరిగానిపల్లి గ్రామాల్లో పర్యటించి, భూముల సర్వేల విధివిధానాలపై సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో డీటీ తిప్పేస్వామి, ఆర్‌ఐ పోతన్న, వీఆర్‌ఓలు నరసింహమూర్తి, రాజశేఖర్, తిమ్మయ్య, సర్వేయర్లు పాల్గొన్నారు.

18న నవోదయ ప్రవేశ పరీక్ష

లేపాక్షి/పుట్టపర్తి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు, డీఈఓ కృష్ణప్ప ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఉదయం 10.30 గంటల్లోపు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలి. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 7,987 మంది విద్యార్థులకు 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అడ్మిట్ కార్డులను www.navo daya.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడు చేసుకో వచ్చు. వివరాలకు 95732 87480లో సంప్రదించవచ్చు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

కుందుర్పి: విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, తద్వారా ప్రతి ఇంటా పిల్లలను ఉన్నత చదువు చదివించాలని ఏపీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ తెలిపారు. గురు,శుక్రవారాల్లో మాయదార్లపల్లి, బసాపురం పంచాయతీలో ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విలువల బడులు ప్రారంభించినట్లు కోఆర్డినేటర్ రఘువీరా తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కుందుర్పి: ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ సీఈఓ నరసింహమూర్తి, అధ్యక్షులు లక్ష్మీపతి తదితరులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కంబదూరు, శెట్టూరు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, అమరాపురం, రొళ్ల మండలాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్: 7013699541లో కుందుర్పిలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ధర్నా

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నియోకవర్గ ఇన్‌చార్జ్ నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో రెండు సెంట్ల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించాలన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చి, గృహాలు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం కార్యదర్శి తిప్పేస్వామి, సీపీఐ మండల కార్యదర్శి దుర్గన్న, కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, మారెన్న, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 11వ వార్డు వడ్డే కాలనీలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, ఆరోగ్య విద్యాబోధకుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, ఆరోగ్య కార్యదర్శి ప్రమీల, సరోజ, నళిని, శోభ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ధర్నా

కూడేరు: మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, మండల కార్యదర్శి నారాయణమ్మ మాట్లాడారు. ఇళ్ల స్థలాలు లేక పేదలు అద్దె ఇళ్లల్లో ఉంటూ ఇబ్బంది పడుతున్నారన్నారు. రీసర్వే డీటీ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్, ఏపీ వ్యకాసం నియోజక వర్గ అధ్యక్షుడు మలరాయుడు, మండల సహాయ కార్యదర్శి ప్రసాద్, మండల నేతలు రమణ, రమణప్ప, వరలక్ష్మీ, ధనరాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

పోటాపోటీగా వరిగడ్డి వేలం

కణేకల్లు: కణేకల్లు వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వరిగడ్డి వేలం పాట పోటాపోటీగా జరిగింది. ఎస్ఎస్ఎంఎఫ్‌లో 72.50 ఎకరాల వరిగడ్డి, పీడీడీఎఫ్‌లో 67.50 ఎకరాల వరిగడ్డిని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి, ఏడీఏ నారాయణనాయక్‌లు ఆధ్వర్యంలో వేలం వేశారు. రైతులు పోటాపోటీగా పాట పాడారు. మొత్తం వరిగడ్డిని ఎస్.తిప్పేస్వామి అనే రైతు రూ.1.68 లక్షకు దక్కించుకున్నాడు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కంబదూరు: తిమ్మాపురానికి చెందిన రవి, బోయ అనిల్ నుంచి 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసు కున్నట్లు ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. తనిఖీల్లో డీటీఎఫ్ జయనాథ్‌రెడ్డి, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

రాయదుర్గంటౌన్: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు నిరసన ర్యాలీ, రిలే నిరాహారదీక్ష చేశారు. తొలుత సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులు పాత బస్టాండ్ వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి, అక్కడ నిరసన తెలియజేశారు.

సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపాల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శివ, నాయకులు తిమ్మప్ప, వెంకటేష్, రమణ, శివకుమార్, నట్రాజ్, అలివేలమ్మ, ఎల్లక్క తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుడు నాగరాజు కుమారుడు నందీశ్వర్ (24) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. సర్పంచ్ విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మలింగ, తిప్పేస్వామి, బాదపల్లెప్ప తదితరులు నందీశ్వర్ మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

కొనకొండ్లలో చోరీ

వజ్రకరూరు: కొనకొండ్ల గ్రామంలో మంగే రాజశేఖర్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. దీనిపై మంగే రాజశేఖర్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితులు మాట్లాడుతూ ఈనెల 3న తన కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రకు వెళ్లడంతో ఇదే అదునుగా చూసి దుండగులు చోరీ చేశారు. బీరువాలోని రెండు జతల బంగారు కమ్మలు, గుండీ కమ్మలు, సాదా కమ్మలు, బంగారు చైన్ లాకెట్, రెండు వెండి బ్రాస్ లెట్లు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో తెలిపాడు.

సంక్షిప్త సమాచారం

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామంలో గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి, రాయదుర్గం పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా మిద్దింటి రంగప్ప, ఉపాధ్యక్షుడిగా రంగతోపాటు మరో ఐదుగురిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గుమ్మఘట్ట పశువైద్యులు నవీన్‌కుమార్ ఎన్నికలను పర్యవేక్షించారు. ఏహెచ్‌ఏలు కిష్టప్ప, ప్రవీణ్ పాల్గొన్నారు.

పన్ను వందశాతం వసూలు చేయాలి

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలోని 18 వార్డు సచివాలయాల పరిధిలో వందశాతం పన్ను బకాయి వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ తన ఛాంబర్‌లో సచివాలయ వార్డు అడ్మిన్ సెక్రటరీలు, అమెనిటీ సెక్రటరీలు, బిల్ కలెక్టర్లతో పన్ను వసూలు, ఎంఎస్ఎంఈ , హౌస్‌హోల్డ్ సర్వేలపై సమీక్ష నిర్వహించారు.

తెప్పకు నిప్పంటించిన ఆకతాయిలు

గుమ్మఘట్ట: రంగసముద్రం సమీపంలో చెరువు పక్కన ఉన్న తెప్పకు గ్రామానికి చెందిన తిమ్మప్ప, పాలయ్య నిప్పంటించినట్లు తాళ్లకెర మత్స్యకార సంఘ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి సిబ్బందిపై ఫిర్యాదు చేస్తాం

వజ్రకరూరు: ఉపాధిహామీ అధికారులపై త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ రమావత్ దేవి ఎలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వెంకటాంపల్లిపెద్ద తండాలో గోకులం షెడ్ల ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులపట్ల నిర్లక్ష్యంగా వహిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నగదు తీసుకొని వ్యక్తి పరార్

కళ్యాణదుర్గం రూరల్: ట్రాక్టర్లతో కంకర తోలే పనులు ఇప్పిస్తానని చెప్పి నగదు తీసుకొని టీడీపీకి చెందిన ఓ వ్యక్తి పరారయ్యాడు. బాధితులు తెలిపిన మేరకు..మహేష్ అనే వ్యక్తి తాను తాడిపత్రికి చెందిన టీడీపీకి నాయకుడిని.. మీకు కళ్యాణదుర్గం నుంచి కంకరతోలే పనులు ఇప్పిస్తానని శెట్టూరుకు చెందిన ఆరు ట్రాక్టర్లను తీసుకొచ్చాడు. ట్రాక్టర్లకు డీజిల్ పట్టిస్తానని డ్రైవర్ల వద్ద రూ.10 వేలు తీసుకొని సెల్ స్విచ్ ఆఫ్ చేసుకొని వెళ్లిపోయాడు. దీనిపై ట్రాక్టర్ డ్రైవర్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం, శెట్టూరు, కంబదూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి, బెళుగుప్ప సెక్షన్ పరిధిలో 33/11 కేవీ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నందున శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఈ మేరకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురురాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నుంచి 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మానిరేవులో వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్యాలప్ప భార్య కురుబ రమాదేవి గురువారం మృతిచెందింది. రాష్ట్ర నాయకులు బోయ తిప్పేస్వామి, నాయకులు శుక్రవారం మానిరేవుకు వెళ్లి రమాదేవి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొమ్మన్న, ఎంపీటీసీ ఓబుళపతి, నాయకులు బోరంపల్లి రామిరెడ్డి గోళ్ల సూరి, షేక్షావలి, చరణ్, వంశీ, హనుమంతు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు

శెట్టూరు: కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం కూడా లేకుండా పోయింది. గ్రామంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ప్రజా ప్రతినిధులను కూడా ఆహ్వానించకుండానే అధికారులు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో శుక్రవారం జరిగిన గోకులం షెడ్డు ప్రారంభోత్సవంలో సర్పంచు భారతి, జడ్పీటీసీ మంజునాథ్, శెట్టూరు మండల ఎంపీపీ లక్ష్మీదేవి స్థానికంగా ఉన్నాకూడా అధికారులు మాత్రం వారెవరికీ సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనుంపల్లి, అయ్యగార్లపల్లి, మాకొడికి, ములకలేడు గ్రామాల్లో అందరూ సర్పంచులు, ఎంపీటీసీలు అందుబాటులో ఉన్నా కూడా కనీస సమాచారం ఇవ్వలేదు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సంక్రాతి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పండుగలు కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి శ్రావణి, రెండో బహుమతి మౌనిక, తృతీయ బహుమతి సోనియాకు అందజేశారు.

పల్లె పండుగలో గోకులం షెడ్లు ప్రారంభం

బెళుగుప్ప: మండలంలో గోకులం షెడ్లను శుక్రవారం ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏపీఓ సూర్యప్రకాశ్‌లు ప్రారంభించారు. ఆవులెన్న, ఎర్రగుడి, బెళుగుప్పల్లో నిర్మించిన రైతుల గోకులం షెడ్లను పల్లె పండుగ వారోత్సవాల్లో ప్రాంభించారు. ఇంజనీర్ రామకృష్ణ, టీఏలు మురళీ, విజయ్‌కుమార్, నాగేంద్ర, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక 'దుర్గం'



జీన్స్ ప్యాంట్లు కుడుతున్న కార్మికులు



ఏరియా ఆస్పత్రి నూతన భవనాలు



వస్త్రాలను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

- విద్య, వైద్య, వస్త్ర రంగాల్లోనూ అభివృద్ధి
- రోజురోజుకూ విస్తరిస్తున్న పట్టణం
- అంతర్రాష్ట్ర రహదారులతో పెరిగిన రియల్ రంగం

రాయదుర్గం: జిల్లాలోని కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం అన్ని రంగాల్లోనూ ట్రెండింగ్‌లో ఉంది. దక్షిణ భారత దేశంలోనే అధునాత జీన్స్ ఉత్పత్తుల తయారీలోనూ వస్త్ర వ్యాపారంలోనూ రాయదుర్గానికి ప్రత్యేకత ఉంది. మారుతున్న యువత అభిరుచులకు అనుగుణంగా జీన్స్ ప్యాంట్ల తయారీలో ఇక్కడి కార్మికులు నిష్ణాతులయ్యారు. కరోనా తర్వాత అతివేగంగా ఈ వ్యాపారం మరింత విస్తరించింది. పట్టుచీరల వ్యాపారం, అధునాతన డిజైన్ల తయారీలోనూ ఉమ్మడి జిల్లాల్లో ధర్మవరం తర్వాత రాయదుర్గంకు మార్కెట్లో మంచి పేరుంది. ఇక్కడి నుంచి పలు రాష్ట్రాలకు ఎగుమతి కావడం విశేషం.

రాయదుర్గం పట్టణంలో విద్య, వైద్య రంగం మెరుగుపడింది. ప్రభుత్వ బడులు కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకున్నాయి. పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చింది. ఏరియా ఆస్పత్రి రాకతో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. జబ్బు ఏదైనా సరే ఉచితంగా వైద్యం అందుతోంది. గతంలో ఏ చిన్న రోగానికైనా బళ్లారి, బెంగళూరుకు వెళ్లాల్సి వచ్చేది. బళ్లారి- బెంగళూరు, అనంతపురం - మొలకాల్మూరు అంతర్ రాష్ట్ర రహదారులు పట్టణానికి ఆనుకొని వెళ్లాయి. దీంతో రియల్ రంగం పుంజుకుంది. గ్రామీణ ప్రాంతాలు వీడి పట్టణాల్లో స్థిరపడే వారి సంఖ్య పెరిగింది. అదే స్థాయిలో పట్టణ విస్తీర్ణం పెరుగోతంది. సిటీ తరహాలో వీధి కో కేఫ్, ఫుడ్ సెంటర్లు వెలిశాయి. అపార్ట్‌మెంట్లు, రెస్టారెంట్ల నిర్మాణాలు పెరిగాయి. వస్త్ర వ్యాపారాల్లో మహిళలు రాణిస్తున్నారు. కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రాలకు పెట్టింది పేరు

నియోజకవర్గంలో లెక్కలేనన్ని ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయి. పట్టణంలో దశభుజ గణపతి ఆలయం దక్షిణ భారత దేశంలోనే ప్రఖ్యాతి గాంచింది. పశుపతి నాథ ఆలయం, కోట ప్రసన్న వెంకటేశ్వరుడి ఆలయాలు ప్రసిద్ధి చెందాయి. మురడి, నేమకల్లులో వ్యాస మహర్షి ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి ఆలయాలు ప్రసిద్ధి. డి హోన్నూరులో దర్గా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే ప్రఖ్యాతి గాంచింది.

దాహం తీరుస్తున్న వైఎస్సార్ తాగునీటి పథకం

పట్టణ వాసులకు వైఎస్సార్ తాగునీటి పథకం శాశ్వతంగా తాగునీటి కష్టాలు తీర్చింది. ఈ పథకం ప్రారంభం కావడంతో దాహం కష్టాలు పట్టణ వాసులకు దూరమయ్యాయి. బీటీపీతో పాటు హెచ్ఎల్‌సీ నీటి ప్రవాహం కారణంగా వ్యవసాయం మెరుగుపడింది.

అన్ని సౌకర్యాలూ అందుబాటులోకి..



రాయదుర్గం పట్టణంలో మౌలిక సౌకర్యాలతో పాటు అన్ని వ్యాపార రంగాలు విస్తరించుకున్నాయి. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. విద్య, వైద్యం, వస్త్ర రంగం మెరుగుపడింది. షాపింగ్ మాల్స్, బంగారం దుఖాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, పట్టుచీరల వ్యాపారం ఇలా ఏదీ కావాలన్నా చెంతనే లభిస్తున్నాయి.

– పొరాళ్ల శిల్ప, మున్సిపల్ చైర్‌పర్సన్, రాయదుర్గం

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



75 వీరాపురంలో ఊరేగుతున్న ఆంజనేయస్వామి

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయంలో స్వామికి వేకువజామున కుంకుమార్చన, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహామంగళారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి మూలవిరాట్‌ను రథంలో కొలువుదీర్చి, గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారిని శనివారం సాయంత్రం ముత్యాలపల్లకీలో ఊరేగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

విస్తరిస్తున్న కళ్యాణదుర్గం

పెరుగుతున్న పట్టణీకరణ

- పంచాయతీగా ఉన్న కళ్యాణదుర్గం మున్సిపాలిటీగా మార్పు
- 50 పడకల ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు
- డివిజనల్ కార్యాలయాలతో సేవలు విస్తరణ
- కేవీకేతో పాటు రైల్వే స్టేషన్ ఏర్పాటు



కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయం

కళ్యాణదుర్గం: పట్టణం విస్తరిస్తుండడంతో పల్లె వాసులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. ఒకప్పుడు పంచాయతీగా ఉన్న కళ్యాణదుర్గం .. మున్సిపాలిటీగా మారడంతో పట్టణ విస్తీర్ణంతో పెరుగుతోంది. అన్ని రంగాల్లోనూ పనులు చేసుకునే వారి సంఖ్య పెరిగింది. దీంతో పల్లెల నుంచి పట్టణానికి ఉపాధి కోసం వస్తున్నారు.

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ప్రస్తుతం 42 వేలకు పైగా జనాభా ఉంది. ఇందులో పురుషులు, మహిళలు మంది మహిళలు, ఇతరులు ఇద్దరు మొత్తం 36,442 మంది ఉండగా, ఇతరులు ఇద్దరు కలిపి 36,444 మంది ఉన్నారు. ఒకప్పుడు మెరుగైన వైద్య సేవల కోసం అనంతపురం, కర్నూలు లాంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. పెరుగుతున్న జనాభాకనుగుణంగా కళ్యాణదుర్గంలోనే 30 పడకల ఆసుపత్రి నుంచి 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటయ్యింది. దీంతో ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి.

డివిజనల్ స్థాయిలో సేవలు మెరుగు

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ కేంద్రంలో డివిజినల్ స్థాయి కార్యాలయాలున్నాయి. దీంతో ప్రజలకు ఆస్థాయిలో సేవలు అందుతున్నాయి. పల్లెలు, మండలాల నుంచి డివిజనల్ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తున్నారు. దుర్గంలో రెవెన్యూ డివిజినల్ కార్యాలయం, సబ్ రిజిస్టార్ కార్యాలయం, పోలీసు డివిజనల్ అధికారి కార్యాలయాలు ఉన్నాయి. దీంతో ప్రజలు నిత్యం రాకపోకలు ఎక్కువగా సాగిస్తుండడంతో రద్దీగా ఉంటోంది. వీటితో పాటు రైల్వే స్టేషన్ ఆధునీకరణ జరుగుతోంది. రైతులకు సంబంధించి వ్యవసాయ సలహాలు, సూచనల కోసం ఎప్పటికప్పుడు కేవీకే ద్వారా శాస్త్రవేత్తలు సేవలను అందిస్తున్నారు.

ప్రముఖ వ్యాపార సంస్థలూ వెలిశాయి..

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ప్రముఖ వ్యాపార సంస్థలు సైతం వెలిశాయి. దీనికితోడు రెస్టారెంట్లు, పెద్ద హోటళ్లు, డాబాలతో పాటు ఫ్యామిలీ రెస్టారెంట్లు వెలిశాయి. పట్టణంలో ప్రముఖ వస్త్ర దుకాణం ఏర్పాటు చేశారు. లాడ్జిలు, ఫర్టిలైజర్స్ దుకాణాలు, అన్ని రకాల బ్యాంకులు, బంగారు దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలతో నిత్యం రద్దీగా ఉంటోంది.

జీవనోపాధి కోసం వచ్చా



నా పేరు వెంకటేష్. మాది బెళుగుప్ప మండలం శీర్పి గ్రామం. నేను ప్రభుత్వాస్పత్రిలో 108 వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నా. నా భార్య వసంత కుమారి ఆర్డీటీ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. ఇద్దరం రోజూ మా ఊరి నుంచి విధులకు రావాలంటే కష్టంగా ఉంది. అందుకే కళ్యాణదుర్గంలోనే ఓ ఇల్లు అద్దెకు తీసుకొని నెలకు రూ.5 వేలు వెచ్చిస్తూ జీవనం సాగిస్తున్నాం. మా లాంటి వారు పట్టణంలో చాలా మంది ఉన్నారు.

– వెంకటేష్, 108 వాహన డ్రైవర్



కళ్యాణదుర్గం రైల్వే స్టేషన్



కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్య కేంద్రం



కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం

రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్‌లో 'దుర్గం' విద్యార్థుల ప్రతిభ



మంత్రి లోకేష్‌తో ప్రశంసలందుకున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

రాయదుర్గంటౌన్: ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయిలో పాలిటెక్ ఫెస్ట్ పోటీల్లో రాయదుర్గం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనుబరిచారు. కళాశాల నుంచి ప్రదర్శించిన దివ్యాంగులు, వయోవృద్ధులకోసం సోలార్ స్మార్ట్ వీల్‌చైర్, కూలీల కోసం బరువులు మోసే పరికరం ప్రాజెక్టులు మంత్రి నారాలోకేష్ చే ప్రశంసలు పొంది, ప్రైజ్ మనీకి ఎంపికయ్యాయి. శుక్రవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాజెక్టులు ప్రదర్శించి, ప్రతిభ కనుబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు అభినందించారు. ప్రాజెక్టుల రూపకల్పనకు సహకరించిన లెక్చరర్లు, ప్రాజెక్టు మెంటర్స్ హర్ష, అలీషా కలాం, షేక్ షబానాలను అభినందించారు.

పాడి పెంపకంతో ఆర్థికాభివృద్ధి

కూడేరు: మినీ గోకులం షెడ్లలో పాడి పెంపకాన్ని చేపట్టి, తద్వారా ఆర్థికాభివృద్ధి చెందాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి సూచించారు. శుక్రవారం చోళసముద్రం, జయపురం, జల్లిపల్లి, మరుట్ల, ఉదిరిపికొండలో ఉపాధి హామీ పథకం ద్వారా సబ్సిడీతో నిర్మించుకున్న మినీ గోకులం షెడ్లను ఎంపీడీఓ కుళ్లాయి స్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, ఇంజనీర్ రవి కుమార్,టెక్నికల్ అసిస్టెంట్లు జనార్ధన్, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, సుగుణ, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడి సన్నిధిలో జిల్లా జడ్జి



జడ్జికి స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన పెన్న హోబిలం లక్ష్మీనృసింహస్వామిని ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లా స్పెషల్ కోర్టు జడ్జి శివశంకర్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శిం చుకున్నారు.జిల్లా న్యాయ మూర్తికి ఆలయ ఈఓ సాకే రమేష్ బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు జడ్జిని సన్మానించారు.